# జీవనోపాధిపై దెబ్బకొట్టొద్దు..



**ప్రభుత్వం ఆదుకోవాలంటూ పలు చోట్ల ఆటో డ్రైవర్ల నిరసన**



మణికొండ మున్సిపాలిటీ మర్రిచెట్టు చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు

## త్వరలో ఆటో సంఘాలతో చర్చలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**

సిటీబ్యూరో, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ) : ఆటో డ్రైవర్ల ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని సోమవారం పలు ఆటో సంఘాల యూనియన్ నేతలు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కోరారు. బీఎంఎస్ అనుబంధ తెలంగాణ స్టేట్ ఆటో అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ యూనియన్ , టీఎస్‌పీటీఎంఎల ఆధ్వర్యంలో మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకువెళ్లారు. ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణం విషయంలో పునరాలోచన, బస్సుల సంఖ్య తగ్గించాలని, ఓలా, ఉబర్, రాపిడ్ బైక్‌ల అక్రమ వ్యాపారాన్ని నిషేధించాలని, ఆటో డ్రైవర్ల ఉపాధిని కాపాడానికి వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఆటోలను వినియోగించాలని, కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆటో, ప్రైవేట్ రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు తదితర డిమాండ్లను ఆటో నేతలు మంత్రి పొన్నం ప్రభాకర్ ముందు ఉంచారు. దీనిపై స్పందించిన మంత్రి త్వరలోనే ఆటో సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని ఆటో సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బీఎంఎస్ ఆటో యూనియన్ నేతలు రవిశంకర్ అల్లూరి, శ్రీనివాస్ ముదిరాజ్, ఎండీ హబీబ్, సంతోష్‌గౌడ్, ఈశం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఆటో సంఘాల యూనియన్ నేతలు

## మణికొండలో ఆటో డ్రైవర్ల రాస్తారోకో

మణికొండ, డిసెంబర్ 18 : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరిట ప్రభుత్వం తమ పొట్టకొట్టొదంటూ మణికొండ మున్సిపాలిటీ మర్రిచెట్టు చౌరస్తాలో సోమవారం ఆటోడ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో రాస్తారోకోను నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు గంటపాటు రోడ్డును దిగ్బంధం చేసి సర్కారుకు వ్యతిరేక నినాదాలను చేశారు. అడ్డుగా వచ్చిన బస్సులను అడ్డుకుని నిలిపివేశారు. తాము జీవనోపాధి కోసం అహర్నిశలు శ్రమిస్తే కానీ మా కడుపులు నిండని పరిస్థితులున్నాయని, ఇప్పుడు కొత్త సర్కారు కొలువు దీరిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తమ బతుకులు దయనీయస్థితికి చేరుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటోడ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకుని ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమకు ఉపాధి కల్పించాలని ఆటోడ్రైవర్లు కోరారు. ఆటోల్లో అధిక శాతం మహిళలే ప్రయాణించే వారని, వారికే బస్సు టికెట్టు ఫ్రీ అని సర్కారు ప్రకటించడంతో తమకు ఉపాధి కరువైందని వారు ఆరోపించారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి తమ జీవనోపాధిపై చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

## ₹15 వేలు చెల్లించాలి

బండ్లగూడ, డిసెంబర్ 18: రాష్ట్రంలో మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు అందరూ రోడ్డున పడ్డారని, వారిని ప్రభుత్వమే అదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. ఆరాంఘర్ చౌరస్తాలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో ఆటో డ్రైవర్ల ఆదాయానికి గండి పడిందని అవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమకు మేలు జరుగుతుందని అనుకున్నామని, కానీ ఈ ప్రభుత్వం తమ ఆశలను నిరాశ చేసిందని వాపోయారు. వెంటనే ప్రభుత్వం ఆటో డ్రైవర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి నేలకు 15వేల రూపాయలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరంజన్, నరేందర్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్, ఆటో డ్రైవర్లు




ప్రభుత్వం అదుకోవాలని ఆరాంఘర్ వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

**బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్**

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 18: ఆటో డ్రైవర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చింతల నందకిశోర్ డిమాండ్ చేశారు. సోమవారం శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శంషాబాద్ ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఇవ్వడంతో ఆటోలను ఎవరూ ఆశ్రయించడంలేదని తెలిపారు. ఆటో డ్రైవర్లు రోజు వారి గిరాకీ లేక కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. ఆటో ఈఎంఐలతో పాటు పిల్లల చదువులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రోజుకు వెయ్యి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## పూల సాగు ఎంతో లాభదాయకం

- తెలంగాణ వాతావరణ పరిస్థితులు అనుకూలం
- ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ఫలితాలు
- ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజా ప్రభాకర్

వ్యవసాయ యూనివర్సిటీ , డిసెంబర్ 18 : తెలంగాణలో ప్రస్తుత పరిస్థితుల్లో పూల సాగుకు, ప్రధానంగా చామంతికి ఎక్కువ డిమాండ్ ఉన్నదని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. నీరజా ప్రభాకర్ అన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పూల పరిశోధన స్థానం సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన చామంతి సాగుపై రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పూలకు, ప్రధానంగా చామంతికి దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉందన్నారు. అందుకు అనుగుణంగా నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వంగడాల విడుదలైనట్లు చెప్పారు. వరి, ఇతర పంటలకన్నా, తక్కువ నీటి వనరులతో ఎక్కువ పంట దిగుబడి, లాభాలు రావడంతో పూల సాగు పెరిగిందన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు, చెరువు, కుంటల కింద వరి సాగు చేయగా, బోరుబావుల కింద ఎక్కువగా కూరగాయలు, పూలు సాగు చేస్తున్నారని తెలిపారు. భూగర్భ జలాలు పెరగడం, తెలంగాణ వాతావరణ పరిస్థితులు పూల సాగుకు అనుకూలంగా ఉన్నాయని గుర్తు చేశారు. సమీపంలోని ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తల సలహా మేరకు సీడ్ కొని సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందవచ్చన్నారు. తెలంగాణ లోని ఉమ్మడి మహబూబ్‌నగర్ , మెదక్, నల్గొండ, నిజామాబాద్‌తో పాటు, హైదరాబాద్ నగర చుట్టూ ఉన్న ప్రాంతాల్లో పూల సాగు గణనీయంగా పెరిగిందన్నారు. ఇటీవల విడుదలైన చీడపీడలను తట్టుకునే చామంతి రకాలను సాగు చేయాలని సూచించారు. నారు మళ్ల నుంచి, కోత, ఎగుమతుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డా. భగవాన్, శాస్త్రవేత్త డా. నవీన్ కుమార్ పాల్గొన్నారు.

